

సోమవారం వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలకేంద్రంలో పరిగి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల మహేశ్‌రెడ్డికి మద్దతుగా మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డితో కలిసి మంత్రి కేటీఆర్ నిర్వహించిన రోడ్‌షోకు నియోజకవర్గ నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో హాజరైన ప్రజలు

# 6 గ్యారెంటీలు కాదు.. 6 నెలలకో సీఎం

కాంగ్రెస్ పార్టీలో ప్రతి ఒక్కరూ సీఎం అభ్యర్థులే

## ఢిల్లీ నుంచి వచ్చే సీల్డ్‌కవర్ సీఎంలు మనకు అవసరమా?: కేటీఆర్

కాకతీయ సామ్రాజ్యం సామంతరాజ్యం కావాలా?

కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న కరెంట్ 5 గంటలే

- అక్కడ కాంగ్రెస్‌ను గెలిపించిన ప్రజలు చెంపలేసుకుంటున్నరు
- 55 ఏండ్లు అధికారంలో ఉన్నా నీళ్లు, కరెంటియ్యలే వాళ్లు..
- సాగు, తాగునీరు, కరెంట్ లేని రోజులు మళ్లీ రావాలా?
- కాంగ్రెస్ పార్టీ కావాలా? 24 గంటల కరెంట్ కావాలా?
- తొమ్మిదన్నరేండ్లలో మేం కరెంట్, సాగు, తాగునీళ్లిచ్చినం..
- రాష్ట్రంలోని ముదిరాజ్‌లకు త్వరలో శుభవార్త చెప్పనున్నాం
- వికారాబాద్ రోడ్‌షోలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్ సిటీబ్యూరో/వికారాబాద్, నవంబర్ 13, (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆరు గ్యారెంటీలు కాదు.. ఆరు నెలలకు ఒకరు సీఎం కావడం ఖాయం.. ఐదేండ్లలో పది మంది సీఎంలు వస్తారని మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఆ పార్టీలో ఎవరికి వారే సీఎం అభ్యర్థినంటూ ఫీల్ అవుతున్నారని చురకలంటించారు. సోమవారం పరిగి నియోజకవర్గ అభ్యర్థి కొప్పుల మహేశ్‌రెడ్డికి మద్దతుగా మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డితో కలిసి మంత్రి కేటీఆర్ కుల్కచర్ల మండల కేంద్రంలో రోడ్‌షో నిర్వహించారు. కనుచూపు మేర కిక్కిరిసిన జనాన్ని ఉద్దేశించి మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ 'కాంగ్రెస్ నేతలు కొత్త పైజామాలు కుట్టించుకుంటుండ్రు. పెద్ద మనిషి జానారెడ్డి కూడా రెడీ అయితుండు. పోటీ చేయకున్నా సీఎం కానికే సోకు పడుతుండు. భట్టి విక్రమార్క సీఎం అంట.. రేటెంతరెడ్డి సీఎం అంట' అని ఎద్దేవా చేశారు. 'రేటెంతరెడ్డి ఆ పార్టీ టికెట్లు మొత్తం పైసలకు అమ్ముకున్నడు.. మొన్న ఓటుకు నోటు.. నిన్న సీటుకు రేటు.. రేపు అధికారమిస్తే ప్లాట్లు చేసి రాష్ట్రాన్ని అమ్మేయడా? ఎవరి చేతుల్లో పడితే వాళ్ల చేతుల్లో రాష్ట్రాన్ని పెడదామా? ఓ ఇంటికి పిల్లనిచ్చే టైంలో పిలగాడు రేవంత్‌రెడ్డిలాగా దొంగనా? లంగనా? అని ఆలోచించే మనం.. రాష్ట్రాన్ని ఎవడికిపడితే వాడికి రాసిచ్చేద్దామా ఆలోచించాలి' అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ నుంచి వచ్చే సీల్డ్ కవర్ సీఎంలు మనకవసరమా? కాకతీయ సామ్రాజ్యం కర్ణాటకకు సామంతం కావాలా? అని ప్రశ్నించారు. కర్ణాటకలో కాంగ్రెస్‌ను గెలిపించిన పాపానికి అక్కడి రైతులు చెంపలేసుకుంటున్నారని, అక్కడ 5 గంటల కరెంట్ మాత్రమే ఇస్తున్నదని, బోర్లు, చెరువులు ఎండిపోవడంతో రైతులు మొసళ్లను సబ్‌స్టేషన్లకు తీసుకువచ్చి ధర్నాలు చేస్తున్నారని తెలిపారు. నాడు కరెంట్‌లేక అర్ధరాత్రి పొలాల వద్ద పడిగాపులు, విద్యుత్తు షాక్‌లు, పాములు, తేళ్లు కుట్టి రైతుల మరణాలు, చెరువులు ఎండిపోయి, ఊర్లు వల్లకాడు అయిన పరిస్థితి నెలకొని ఉండేదని, ఆ దయనీయ పరిస్థితులు మళ్లీ రావాలా? అనేది ఆలోచించాలని కోరారు. 55 ఏండ్లు అధికారంలో ఉన్న కాం గ్రెస్ కరెంట్, నీళ్లు ఇవ్వలేదని చెప్పారు. కాంగ్రెసోళ్లు ఉన్నప్పుడు ఊర్లల్లో ఎవరైనా చనిపోతే అంత్యక్రియల తర్వాత స్నానాలు చేయడానికి కరెంట్ ఇవ్వాలని బతిమిలాడిన పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. 52 కిలోల బక్కపలచని ఒక్క కేసీఆర్‌ను ఖతం చేసేందుకు ఢిల్లీ నుంచి ఎంతో మంది వస్తున్నారని, ఎంతమంది వచ్చినా భయంలేదని.. సింహం సింగిల్‌గానే వస్తుందని చెప్పారు. ముదిరాజ్‌లు త్వరలో శుభవార్త వింటారని తెలిపారు.

### మూడోసారి గెలవగానే 4 కొత్త కార్యక్రమాలు

ఈ తొమ్మిదిన్నరేండ్లలో ఏ ఊరికిపోయినా కేసీఆర్ పథకాలు అందని ఇల్లులేదని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. మూడోసారి సీఎంగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టిన వెంటనే నాలుగు కొత్త కార్యక్రమాలను చేపట్టనున్నామని తెలిపారు. భూమి ఉన్నా, లేకున్నా తెల్లరేషన్ కార్డున్న 90 లక్షల మంది కుటుంబాలకు రూ.5 లక్షల కేసీఆర్ బీమా పథకాన్ని అమలు చేస్తామని చెప్పారు. కల్యాణలక్ష్మి మాదిరి సౌభాగ్యలక్ష్మి పథకాన్ని తీసుకువచ్చి 18 ఏండ్లు నిండిన అర్హులైన ఆడబిడ్డలకు నెలకు రూ.3 వేల ఆర్థిక సహాయం అందజేసి, ఆదుకుంటామని చెప్పారు. తెల్లరేషన్ కార్డున్న ప్రతీ కుటుంబానికి సన్నబియ్యం అందిస్తామని, 5 లక్షలుగా ఉన్న ఆరోగ్య బీమాను రూ.15 లక్షలకు పెంచుతామని, అసైన్డ్‌భూములున్న వారందరికీ పూర్తి హక్కులు కల్పిస్తామని తెలిపారు. రైతుబంధు కింద ప్రస్తుతం ఎకరాకు రూ.10 వేలు ఇస్తున్న పెట్టుబడి సాయాన్ని రూ.16 వేలకు పెంచుతామని చెప్పారు. ఆసరా పింఛన్ కింద ఇచ్చే మొత్తాన్ని క్రమక్రమంగా రూ.5 వేలకు పెంచుతామని చెప్పారు. ప్రతీ తండాలో సేవాలాల్ భవనాలు, మహిళా సమాఖ్య భవనాలను కట్టించే బాధ్యత తమదేనని కేటీఆర్ హామీ ఇచ్చారు.

### ముచ్చటగా మూడోసారీ కేసీఆరే సీఎం

బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తున్నదని, మూడోసారి కేసీఆర్ సీఎంగా బాధ్యతలు చేపడతారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు అభివృద్ధి, సంక్షేమం కోసం పనిచేసే వారిని ఆదరిస్తారని, ఎన్నికల సమయంలో వచ్చే పొలిటికల్ టూరిస్టులను నమ్మబోరని చెప్పారు. ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్టు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని విమర్శించారు. సోమవారం సికింద్రాబాద్‌లో సనత్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్‌లో ఆరు నెలలకోసారి సీఎం మారతాడని, వారికి పదవిపై ఆశ తప్ప అభివృద్ధిపై ఉండబోదని విమర్శించారు. ఒక్క సీఎం సీటు కోసం 400 మంది ప్రాణాలను పొట్టనపెట్టుకున్న చరిత్ర కాంగ్రెస్‌దని, కుర్చీ, పదవి కోసం ఆ పార్టీ ఎంతకైనా తెగిస్తుందని మండిపడ్డారు. బీజేపీకి అభివృద్ధి నమూనా ఉండదని, కులాలు, మతాల పేరిట చిచ్చుపెట్టి రాజకీయం చేయడమే పనిగా పెట్టుకుంటారని చెప్పారు. హైదరాబాద్‌లో బీజేపీ అనేది ఉండకూడదని, గోషామహల్‌లో బీజేపీకి డిపాజిట్ రాదని, ఇందుకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈసారి బీజేపీకి ఆ ఒక్క సీటు కూడా రాదని, రాష్ట్రంలో మోదీకి ఎంట్రీ లేదని ఈ ఎన్నికలు నిరూపిస్తాయని తెలిపారు.



బీఆర్ఎస్‌లో చేరిన పాల్వాయి స్రవంతితో మంత్రి కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యే కూసుకుంట్ల, బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ తదితరులు

# కరెంటా? కాంగ్రెస్సా?

- కరెంట్‌పై కాంగ్రెస్‌కు అవగాహనలేదు
- రేవంత్ వ్యాఖ్యలను గమనించండి
- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి డబ్బు అహంకారాన్ని అణచివేయాలి
- తుల ఉమ, పాల్వాయి స్రవంతిని అవమానించడం బాధాకరం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్





తెలంగాణభవన్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న తుల ఉమ

హైదరాబాద్, నవంబర్ 13(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌కు కరెంటుపై ఏమాత్రం అవగాహనలేదని, రేవంత్ చేస్తున్న వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. రైతులకు 3 గంటల కరెంట్ సరిపోతుందన్న రేవంత్ వ్యాఖ్యలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. రైతుబంధుతో కేసీఆర్ డబ్బులు వృథా చేస్తున్నారని ఉత్తమ్‌కుమార్ పేర్కొన్నారంటేనే వారి వైఖరి స్పష్టమవుతున్నదని విమర్శించారు. కరెంట్ కావాలా? కాంగ్రెస్ కావాలా? రైతుబంధు కావాలా? రాబంధు కాంగ్రెస్ కావాలా? అనే విషయంలో ప్రజలు స్పష్టంగా ఉన్నారని చెప్పారు. సీఎం కేసీఆర్‌ను తెలంగాణకే కట్టడి చేయాలని మోదీ, రాహుల్ భావిస్తున్నారని, ఇంత దుర్మార్గమైన నీతిని, రీతిని అనుసరిస్తున్న కాంగ్రెస్, బీజేపీకి ప్రజలు తగిన బుద్ధిచెప్పాలని విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ కీలక నేత పాల్వాయి స్రవంతి సోమవారం తెలంగాణభవన్‌లో వేర్వేరుగా మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి డబ్బు అహంకారాన్ని అణచివేయాలని పిలుపునిచ్చారు. స్వార్థం కోసం పార్టీలు మారుతూ ప్రజలను ఏమార్చే రాజగోపాల్‌రెడ్డికి ఇప్పటికే ఒకసారి మునుగోడు ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టారని, మరోసారి అది తప్పదని హెచ్చరించారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఎమ్మెల్యే పదవికి, కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో ఎందుకు చేరారో? తిరిగి కాంగ్రెస్‌లోకి ఎందుకు వెళ్లారో మునుగోడు ప్రజలకు తెలియదా? అని వ్యాఖ్యానించారు. మునుగోడు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీచేయడానికి ఎవరూ ముందుకు రాని సందర్భంలో పాల్వాయి స్రవంతి పార్టీ కోసం నిలబడిన విషయాన్ని గుర్తుచేశారు. దశాబ్దాలు కాంగ్రెస్‌కు అండగా నిలిచిన పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి కుటుంబాన్ని ఆ పార్టీ తీవ్రంగా అవమానించిందని విమర్శించారు. బీఆర్ఎస్‌లో చేరిన పాల్వాయి స్రవంతికి, ఆమె వెంట వచ్చిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

### తుల ఉమక్క మా ఆడబిడ్డ

'మా ఆడబిడ్డ మా ఇంటికి తిరిగొచ్చినందుకు సంతోషంగా ఉన్నది' అని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ సూచన మేరకు స్వయంగా తానే ఉమకు ఫోన్ చేసి ఆహ్వానించానని, తమ ఆహ్వానాన్ని మన్నించి రావడం సంతోషంగా ఉన్నదని తెలిపారు. తుల ఉమను 'ఉమక్క'అంటూ ఆప్యాయంగా సంబోధించి కేటీఆర్.. ఆమెకు గతంలో కంటే మరింత సమున్నత హోదా, బాధ్యతలు అప్పగిస్తామని, అందుకు తానే పూర్తి బాధ్యత తీసుకుంటానని చెప్పారు. ఆమెకు బీజేపీలో అవమానం జరగడం బాధగా ఉన్నదని పేర్కొన్నారు.

### బీఆర్ఎస్‌తోనే మేలు: పాల్వాయి స్రవంతి

బీఆర్ఎస్‌తోనే తెలంగాణకు మేలు జరుగుతుందని పాల్వాయి స్రవంతి స్పష్టం చేశారు. బాగా ఆలోచించి బీఆర్ఎస్‌లో చేరానని చెప్పారు. మునుగోడులో పార్టీ గెలుపు కోసం కృషి చేస్తామని చెప్పారు.

### మాటకు కట్టుబడని బీజేపీ: తుల ఉమ

బీసీని ముఖ్యమంత్రిని చేస్తానంటూ బీజేపీ చెప్తున్నది బిల్డప్ మాత్రమేనని తుల ఉమ విమర్శించారు. తనకు బీజేపీ వేములవాడ అసెంబ్లీ టికెట్ ఇచ్చినట్టే ఇచ్చి గుంజుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. బీసీలకే కాకుండా మహిళలకు బీజేపీ ఇచ్చే ప్రాధాన్యానికి ఇంతకన్నా ఏ సాక్ష్యం కావాలని ప్రశ్నించారు. ఇచ్చిన మాటకు కట్టుబడని పార్టీ బీజేపీయేనని ధ్వజమెత్తారు. తాను బీఆర్ఎస్‌లో అనేక హోదాల్లో పని చేశానని, మళ్లీ బీఆర్ఎస్‌లో చేరడం తల్లిగారి ఇంటికి వచ్చినంత సంతోషంగా ఉన్నదని చెప్పారు.

### గొల్లకురుమలకు అవమానం

వేములవాడ టికెట్ విషయంలో తనకు జరిగిన అవమానం గొల్ల కురుమ జాతికి జరిగిన అవమానంగా భావిస్తున్నట్టు తుల ఉమ పేర్కొన్నారు. తనతోపాటు ఎందరో బీసీ నాయకులకు బీజేపీ అన్యాయం చేసిందని విమర్శించారు. బీఫాంలే సరిగా ఇవ్వలేని బీజేపీ.. బీసీ సీఎం నినాదం ఎత్తుకోవడం విడ్డూరమని ఎద్దేవా చేశారు. బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలి హోదాకు రాజీనామా చేసినట్టు చెప్పారు.

# దళితబంధుపై ఆందోళన వద్దు

- కరోనాలోనూ పింఛన్లు ఇచ్చినం
- కాంగ్రెస్ నేతలవి అబద్ధపు ప్రచారాలు
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



బాల్కొండ మండలం జలాల్‌పూర్‌లో మాట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ, నవంబర్ 13 : దళితబంధు పథకం పవిత్రమైనదని, ఇలాంటి ఆలోచన దేశంలో ఇంతవరకు ఎవరూ చేయలేదని, దశలవారీగా దళితబంధు లక్ష్యం పూర్తవుతుందని మంత్రి, బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. నాలుగేండ్లలో నియోజకవర్గంలో అందరికీ దళితబంధు అందించి తీరుతామని భరోసా కల్పించారు. సోమవారం నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలంలో ప్రచారం నిర్వహించారు. దళిత కుటుంబాలపై కేసీఆర్‌కు ఉన్న ప్రేమకు దళితబంధు నిదర్శనమని పేర్కొన్నారు. నాలుగు రాష్ట్రాల్లోని కాంగ్రెస్ పార్టీ, 18 రాష్ట్రాల్లో ఉన్న బీజేపీ దళితబంధు లాంటి పథకాన్ని ఎందుకు తేలేదని ప్రశ్నించారు. రుణమాఫీ సంపూర్ణంగా అమలవుతుందని, ప్రతిఒక్కరికి రుణమాఫీ జరిగి తీరుతుందని స్పష్టం చేశారు. దళితబంధు, రుణమాఫీపై విపక్షాలు చేసే దుష్ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక, బీజేపీ అధికారంలో ఉన్న మహారాష్ట్రలో లేవని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు కర్ణాటక, మహారాష్ట్రకు వెళ్లి చూసి వాస్తవాలు గ్రహిస్తే కారు గుర్తుకే ఓటు వేస్తారని అన్నారు. కేసీఆర్‌ది మానవీయ పాలన అన్నారు. కరోనా విపత్తు సమయంలోనూ ఆసరా పింఛన్లు ఆపకుండా పేదలకు ఆసరాగా నిలిచినట్టు గుర్తుచేశారు.

### మంత్రి వేములకే మా ఓటు



జలాల్‌పూర్‌లో ప్రచారం నిర్వహిస్తుండగా గ్రామానికి చెందిన వృద్ధుడు ఎర్రం గంగారాం మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి వద్దకు వచ్చి 'మా ఓటు మీకే' అని నినదించాడు. 'ఇంత మంచి అభివృద్ధి ఎన్నడూ సుడలే. గతంలో మా జలాల్‌పూర్‌లో కట్టమీదికి పోవాలంటే సైకిల్ తోవ కూడా లేకుండే. అలాంటిది మన మంత్రి వేముల వచ్చాక రెండు ట్రాక్టర్లు పో యేంత రోడ్డు వేశారు. మా ఊళ్లో రోడ్లు మంచిగా అయినాయి. మీరే మళ్లీ గెలువాలి. మీకే మా ఓటు' అని గంగారాం ప్రకటించాడు.